# మనిషి - పిడికెడు ఆకాశం

## ఊరు ఉద్రిక్తంగా ఉంది.

ఊరు ఉద్రేకంగా ఉంది.

ఊరు ఉన్మాదంగా ఉంది.

నాకు తెలుసు. నిన్నా మొన్నా చాలా చాలా దుర్ఘటనలు జరిగినై. ఆందోళన, అలజడి, అరాచకం.

ఎందుకు మొదలైందో తెలీదు. ఎలా మొదలైందో తెలీదు. ఎక్కడ మొదలైందో తెలీదు.

ఏమూలో 'ఫలానా' సంఘటన జరిగిందని ఎవరో ఎవరితోనో అంటారు.

అది నరం లేని నాలుకల మీద నడుస్తుంది.
అది టెలీఫోన్ తీగెల మీద పరిగెత్తుతుంది.
అది బస్సుల మీద బరితెగిస్తుంది.
అది రైలు బోగీల మీద యాగీ చేస్తుంది.
అది రహదారుల మీద బరాబరులు చేస్తుంది.
అది అంగళ్ళకు అగ్గి పెడుతుంది.
అది పేటల మీద పెట్రోలు చల్లుతుంది.

కంకర్రాళ్ళకీ, సోడాబుడ్లకీ కాళ్ళొస్తాయి. కత్తులూ, కర్రలూ, బరిశెలూ, గొలుసులూ, తాండవం చేస్తాయి.

మనిషి పాపు అవుతాడు....మనిషి పశువౌతాడు.... మనిషి చిల్లపెంకు అవుతాడు .... మనిషి గడ్డిపోచ అవుతాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే — ఇవాళ ఊరికి పూనకం వచ్చింది.

అందుకే అతన్ని 'వెళ్దామంటావా?' అని అడిగాను. బాల్కనీలో నిలబడే బయటికి చూశాను.

అప్పటికింకా మసక చీకటిగా వుంది. వేకువ రేకలు విచ్చుకోలేదు.

నా వైపు పరీక్షగా చూస్తూ 'తప్పకుండా' అన్నాడు. అతని కంఠస్వరం స్ఫుటంగా వుంది.

"పరిస్థితులు బాగా లేవు కదా. పోనీ ఇవాళ్టికి మానేద్దామా?" అని నేను నసిగాను.

చిత్రంగా నవ్వేడు. "ఏం ఫర్వాలేదు. పక్కన నేనుండగా ఏం భయం లేదు. రా."

మేము బయలుదేరాం. మా మార్నింగ్ వాక్ మొదలైంది. పక్కపక్కగా నడుస్తున్నాం.

" రాత్రి మీ ఇంట్లో తీసుకున్న శ్రీఖండ్ పొట్టలో ఇంకా అలాగే కూర్చునివుందోయ్, " అన్నాన్నేను.

" మీ వదినె బెస్ట్ కుక్ కదూ. చాలా రుచిగా వుంది. "

" యస్. యస్. ఒక్క శ్రీఖండ్ అనే ఏమిటి? ఆ కట్లెట్ కూడా అలాగే వుంది. ఆపకుండా లాగించేశాను. లెక్కలేదు. "

అతని ముఖంలో ఎంతో సంతృప్తి.

'అందుకే మీ ఇంట్లో భోజనం అంటే భయం నాకు.

సన్నగా నవ్వేడు. " అక్కడికి మీ ఇంట్లో తక్కువైనట్లు. మా వదిన గారికి మరీ అభిమానం జాస్తి. నీకంటే భోళామనిషి. ఆవిడది పిచ్చి ప్రేమ. ఏది వడ్డిస్తున్నా — తల్లిని మరపిస్తుంది. "

" బాగుంది ఈ పరస్పర డబ్బా. "

అతను నా చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా, వాత్సల్యంగా నొక్కాడు. " మనిద్దరిలో ఎవరు పెద్దో ఎప్పుడూ ఆలోచించుకోలేదు మనం. నువ్వు మా ఆవిడ్ని వదిన అంటావ్. నేనూ మీ శ్రీమతిని వదిన అనే అంటాను చిత్రమైన విషయం. " ఇద్దరమూ నవ్వుకున్నాం.

నెహ్రూ రోడ్ ఎక్కాం. అక్కడొకరూ ఇక్కడొకరూగా మనుషులు మసలుతున్నారు. పలుచగా వాహనాలు కదులు

తున్నై. చల్లటి ఎదురుగాలి తెరలు తెరలుగా వీస్తోంది. రోడ్ మార్జిన్‌లో తురాయి చెట్లూ, వేపచెట్లు — వీచేగాలికీ, వినేసవ్వడికీ ఊఁ కొడుతున్నట్లు తలలాడిస్తున్నై.

అతనన్నాడు, " అమ్మాయి పెళ్ళి తేదీ గుర్తుంది కదా — మే తొమ్మిది. ఏదో వో కుంటి సాకు చెప్పి తప్పించుకోకు నువ్వు ఎంత ఆఫీస్‌కి పుస్తె కట్టినవాడివైనా— తనామనా చూసి ఇలాంటి అకేషన్స్‌కి తప్పకుండా వస్తూ వుండాలి. అప్పుడే ఈ స్నేహాలూ, బంధాలూ నిలిచేది. ఎందుకు చెప్తున్నానంటే మొదటి పిల్లపెళ్ళికి రాలేదు నువ్వు. పైగా నీకెప్పుడూ టూర్‌ల బిజీ కూడా. "

నేను నవ్వి అన్నాను ' ఈ సారి చూస్తాంవుగా. తప్ప కుండా వస్తాను. '

" నువ్వు రావటమే కాదు, పదినా పిల్లల్ని కూడా తీసుకురావాలి. "

" అలాగే " అని హామీ ఇచ్చాను. అతని కుటుంబ సభ్యులందరూ కళ్ళ ముందు మెదిలారు. అతని తల్లీ తండ్రీ, భార్య, ముగ్గురు ఆడపిల్లలూ, నాలుగోవాడు పిల్లవాడు. క్షణాల తర్వాత అతనికేసి చూస్తూ అడిగేను — " కట్నకానుకలు చాలా ఎక్కువవంటివి కదా. ఎట్లా మేనేజ్ చేస్తున్నావో ఏమో. నేనేమన్నా చేద్దామన్నా — నీకు తెలుసుగా. ఇల్లు కట్టి కూర్చున్నా. దానికీ చాలా అప్పు కూడా అయింది. "

"నోనో డోన్ట్ వర్రీ. నీ మనసు నాకు తెలుసుగదా. వెసులుబాటు ఉన్నప్పుడు ఇదివరకు నువ్వు ఇవ్వలేదా నేను తీసుకోలేదా. అయినా ఇప్పుడా అవసరం లేదు. మా రెండు లారీల్ని అమ్మేస్తున్నాను. వేరే డబ్బూ ఉంది. పెళ్ళికి ఎలాంటి ఇబ్బందీ లేదు. తర్వాత సంగతి తర్వాత చూద్దాం."

నేను తృప్తిగా ఊపిరిపీల్చుకున్నాను.

ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గరికొచ్చాం. మా నడక ఆగింది.

రోడ్డు వారగా వున్న టీ బంకులు తెరుచుకుంటున్నై. పక్కగా పల్లంలో వెలసిన వాడి — ఆవులిస్తూ వొళ్ళు విరుచుకుంటోంది.

"ఏమైనా ఈ పెళ్ళిళ్ళూ కట్నాలూ—అంతా పెద్ద విషవలయంలా మారిపోయింది," నేను యథాలాపంగా అన్నాను.

"అవును," అతనన్నాడు. "ఆ డిమాండ్ చెయ్యటం కూడా చాలా కరకుగా, నిక్కచ్చిగా డిమాండ్ చేస్తున్నారు. చివరికి భోజనంలో ఎన్ని స్వీట్స్ వుండాలో, ఏఏ కూరలు వండాలో కూడా చెప్పే స్థితికి వచ్చారు. ఇంకో తమాషా తెలుసా నీకు: డిన్నర్ తర్వాత ఐస్ క్రీమ్ కావాలన్నారు. సరేనన్నాం. అది ఏ కంపెనీది, ఏ రేటుది వుండాలో ఉత్తరంలో వ్రాశారు."

"వఁరీ దోపిడీగా ఉంది. అవతలవాడిది డబ్బు కాదు — చిల్లపెంకులనే భావన." కటువుగా, కసిగా అన్నాను.

"ప్రపంచం మారుతున్నదంటున్నారు కానీ 'మనిషి మారలేదు' అన్నది మాత్రం అలాగే నిలిచి వుంది."

"ఎగ్జాట్లీ! మానవత్వాన్ని మరచి మరబొమ్మలా తయారౌతున్నాడు మనిషి."

మా ఇద్దరి మనస్సుల్లోనూ ఏవేవో భావాలు.

పదేళ్ళ పాటు నేనూ, అతనూ పక్కపక్క పోర్షన్స్‌లో వున్నాం — ఈ వూళ్ళోనే. ఐదేళ్ళ క్రితం నాకు ప్రమోషన్ మీద బదిలీ అయింది. నిజంగా రెండు కుటుంబాల్లోని వ్యక్తులూ ఆ వేర్పాటుకు ఎంతగానో విచారించారు. మా అందరి మధ్య అలాంటి ఆత్మీయతలూ, అనుబంధాలూ నెలకొని వున్నై మరి. ఇన్నాళ్ళకి మళ్ళీ ఆరురోజుల టూర్ మీద ఆక్కడికి రాగలిగాను.

మౌనంగా రోడ్ క్రాస్ చేశాం. గాంధీ రోడ్ ప్రవేశించాం.

రంగు కాగితాల తోరణాలు తెగి చెల్లాచెదురుగా పడి వున్నై. వారం క్రితం మంత్రిగారి పర్యటన సందర్భంగా ఏర్పాటైన ఉత్సవానికి చిహ్నాలు అవి. తెగిన బ్యానర్లు చెట్ల కొమ్మలకి వ్రేలాడుతున్నై.

C.P. BROWN MEM...

"మళ్ళీ కోలాహలం మొదలౌతోంది. మనుష్యులు చచ్చి ఏడుస్తుంటే నాయకులు పర్యటనలు ప్రారంభిస్తున్నారు. అన్నీ శుష్క ప్రియాలూ శూన్యహస్తాలూ," అతను చాలా ఏవగింపుగా అన్నాడు.

"మొసలి కన్నీరు పంచి పోతారు. అంతేగా." మా సంభాషణ రాజకీయాల మీదకి మళ్ళింది.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ నాలుగు గజాలు నడిచాం. అక్కడొక చిన్న వంతెన ఉంది. ఆ వంతెన మీద కొద్దిసేపు కూర్చుని అక్కణ్ణుంచీ వెనుదిరగడం మా దినచర్య. నేను ఈ వూరు వచ్చిన నాలుగు రోజుల్నుంచీ అలాగే చేస్తున్నాం. వంతెన గోడ మీద కూర్చున్నాం. నేను అటూ ఇటూ చూశాను. ఆ వంతెన చివరగా పెద్ద రావి చెట్టు వుంది. దాని క్రింద గాంధీ బొమ్మ. రావిచెట్టు కమ్మ తెమ్మెరని పంచుతోంది. వాతావరణం చాలా ఆహ్లాదంగా వుంది.

అతను అడిగాడు, "ఈ ఏడన్నా ట్రాన్స్‌ఫర్ వస్తుందా మీ వూరికి ?"

"ఏమో చూడాలి. మన ప్రయత్నం మనం చెయ్యగలమే గానీ, ఫలితం మన చేతుల్లో లేదు గదా."

"అవుననుకో," అని ఒక్క క్షణం ఆగి అన్నాడు, "ఏం లేదు. ఎంతో కష్టపడి ఇల్లు కట్టించుకుంటిరి. ట్రాన్స్ఫర్ వస్తే సొంత ఇంట్లో వుండే అవకాశం కలుగుతుంది కదా అని."

నాకు నా శ్రీమతీ, ఇద్దరు మొగపిల్లలూ, తొమ్మిది చదువుతున్న ఆడపిల్లా కళ్ళ ముందు మెదిలారు. ఎప్పుడెప్పుడు స్వంత ఇంట్లోకి పోతామా అనే వాళ్ళ ఉత్సాహమూ గుర్తుకొచ్చింది. 'మీ వదినా, పిల్లలూ కూడా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు,' అన్నాను.

"అందుకే గట్టిగా ట్రై చెయ్యి."

"అట్లాగే."

మేము సొదలు కలబోసుకుంటూ మరో కొద్దిసేపు ఆ వంతెన మీదే కూర్చున్నాం. ఉన్నట్లుండి కేకలూ, అరుపులూ, కోలాహలం వినిపించినై.

లేచి నిలబడి వెనక్కి చూశాము. మేము ఇంతసేపూ నడిచి వచ్చిన వైపు జనసందోహం పరుగలు తీస్తూ వస్తున్నారు. కేకలూ గాలిలో కలిసిపోతున్నై. మేము మొహమొహాలు చూసుకున్నాం. ఇద్దరి ఆలోచనల్లోనూ — గడచిన నాలుగు రోజుల్లోనూ జరిగిన సంఘటనలు పరుగులు తీస్తున్నాయి. నా గుండెల్లో ఏదో గుబులు బయల్దేరింది. అడుగులు దగ్గరపడుతున్నై.

అతనన్నాడు, 'ఫర్వాలేదు. మనం ఈ చెట్టు క్రిందగా నిలబడదాం పద.' త్వరత్వరగా రావిచెట్టు క్రిందకు చేరాం.

అప్పటికప్పుడే ఆ గుంపు మా దగ్గరికొచ్చేసింది. అంతాకలిసి ఓ ఇరవై మంది కంటే వుండరు. వాళ్ళ చేతుల్లో — సైకిల్‌చైన్‌లూ, బరిశెలూ, కర్రలూ. '........ డౌన్‌డౌన్'. ' ప్రాణాలిస్తాం ........ ', ' ఇంకానా ఇకపై సాగదు ........ ' ' ........ అమర్ రహే ', ' ........ జిందాబాద్ ', ఏవేవో నినాదాలు ఎలుగెత్తి అంటున్నారు.

కాలువ గట్టున పల్లంలోని వాడలో మనుషులెవ్వరూ బయటికి రాలేదు. ఒకరిద్దరు చూసి తలుపులు వేసుకున్నారు. దారిన పోతున్న వాహనాలు — ఉలిక్కిపడి, పక్కకు తప్పుకుని, స్పీడ్ పెంచి — పరిగెత్తుతున్నై.

గుంపు రావిచెట్టు క్రిందకు చేరింది.

నా వెన్నులో భయం పాకింది. అతన్ని కొంచెం మరుగు చేస్తూ నేను గాంధీ బొమ్మపక్కగా నిలబడ్డాను. వాళ్ళ నినాదాలు మిన్ను ముట్టినై. కందిరీగలు కుట్టినట్లుగా ఉంది నాకు. రావి చెట్టు గాలికి ఊగలూ, సెగలూ కమ్మినట్లనిపించింది. నా వొళ్ళంతా చిరుచెమటలు పట్టినై. ఒకే మట్టితో చేసిన బొమ్మలు — అయితేనేం ? నా మనసులో ఏవేవో ప్రశ్నలూ, సందేహాలూ, అనుమానాలూ !

గుంపు నెమ్మదిగా కదిలింది.

నాకు ఊపిరి అందుతోందనిపించింది. అతనికేసి చూశాను. అతని పెదవుల మీద చిరునవ్వు. 'నో ప్రాబ్లెమ్' అన్నాడు, మెల్లగా నా చెవుల్లో. రెండడుగులు పక్కకి వేసి నా ముందుకి వచ్చాడు.

నేను సాగుతున్న గుంపుకేసి పరీక్షగా చూస్తున్నాను.

గాడిలో పోతున్న బండి చక్రానికి రాయి తగిలినట్లయింది. గుంపులో చాలా వెనగ్గా ఉన్న ఇద్దరు తిరిగితిరిగి మావైపు చూశారు. నేను 'వెళ్దాం పద' అంటున్నానో లేదో — మెరుపు వేగంతో మాముందు వాలారు.

క్షణంలో సగంసేపు — ఏం జరుగుతోందో తెలియని విషఘడియ అది. వాళ్ళ కళ్ళల్లో ఉద్రేకపు చింతనిప్పులు. అంతే — ద్వేషం పడగవిప్పడం, ఉన్మాదం పంజావిసరడం జరగనే జరిగింది.

అతనిమీదకి దూకిన కత్తివేటుని తప్పించాలని నేను-తనకు తానే తప్పించుకోవాలని అతను .... రెండూ విఫలమైనై. అతను నిలువునా కూలిపోయాడు.

మరుక్షణం వాళ్ళు అక్కడ లేరు.

గొంతు బిగబట్టిన ఘోరక్షణం అది. మాటపెగలని మహాదుర్ముహూర్తం అది. గుండె పగిలిన కుత్సితపు

ఘడియ అది. నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. అతన్ని పొదివి పట్టుకుని అతని తలని నా తొడ మీద ఆనించుకుని కూర్చున్నాను. అతని కళ్ళనిండా నీళ్ళు. బాధని తట్టుకోలేక భోరున ఏడుస్తున్నాడు. నేను చేష్టలు డిగినవాడిలా మూగగా అతని కేసి చూశాను. కన్నీళ్ళు నా చూపుల్ని మసకబరుస్తున్నై. అటూ ఇటూ పరికించాను. ఎవరూ వస్తున్న జాడలేదు. అక్కడే పారేసి పోయిన కత్తి — అతని పక్కగా! అది నన్ను వెక్కిరిస్తోంది. ఈ రోజు లేస్తుండగానే నాలో పుట్టిన సందేహానికి పర్యవసానం ఇదా!! నా ముక్కుపుటాలు అదురుతున్నై. దుఃఖంతో గొంతు పూడుకుపోతోంది. అతన్ని వెంటనే హాస్పిటల్‌కి తీసుకు పొమ్మని హెచ్చరిస్తోంది — వివేకం. అతన్ని లేవదీయా లని పూనుకుంటూ దిక్కులు చూస్తూన్నాను.

అతను అటూ ఇటూ కదిలాడు.

ఏం జరుగుతోందో తెలుసుకునేలోగా, రెప్పపాటులో — అతను ఆ కత్తితో నా డొక్కలో పొడిచాడు!

గుండెలు అదురుతున్న షాక్! "అమ్మా" అన్న మాట పెల్లుబికి గావుకేకగా మారింది. నా కళ్ళు మూతలు పడుతున్నై. నేను వాలిపోతున్నాను.

♦ ♦ ♦

నేను కళ్ళు తెరిచేసరికి — ఎదురుగా మా ఆవిడ.

ఆమె పక్కగా మా వదిన—అతని భార్య: నేరస్థురాలిలా ఆమె కళ్ళలో సిగ్గు. ముఖంలో తరిగిన కాంతి. ఉద్వేగంతో ఏడుస్తూ నా రెండు చేతులూ పట్టుకుంది. వెంటనే చేతుల్లో ముఖం కప్పుకొని భోరుమంది.

నేను నిర్లిప్తంగా రెప్పలార్చాను. "ఎలా వున్నాడు ?" హీనస్వరంతో అడిగాను.

"అవతల వార్డులో వున్నాడు. ప్రమాదం గడిచినట్లే అన్నారు డాక్టర్లు. 'నేను చేసిన పాపానికి నిష్కృతిలేదు. నన్ను చంపెయ్యండి' అని ఒకటే ఏడుపు. కుమిలిపోతున్నాడు," మా ఆవిడే సమాధానం ఇచ్చింది. నేను దీర్ఘంగా ఊపిరిపీల్చుకొని కళ్ళుమూసుకున్నాను.

నా కళ్ళముందు—

ఏవేవో నీలి నీలి తెరలు....రంగురంగుల దిక్చక్రాలు. దురూహ్యమైన నిశ్శబ్దం. ఆరు ఋతువులూ ఒకేసారి చుట్టుముడుతున్న భావన. వంతెన దిగువగా రావిచెట్టు. రావిచెట్టు క్రింద గాంధీబొమ్మ. పచ్చనిపుటంమీదా, తెల్లని పటంమీదా మసకలూ – మరకలూ !! ఆపైన నీలి ఆకాశం. నెలవెలుగు. పలుచని చీరలోంచి మెరుస్తున్న తాళిబొట్టు, నల్లపూసలూ: చేతులకి అగ్నిశిఖ గాజులు. ఎవరా ఆకారం ?

సావధానంగా సృష్టికథ వినిపిస్తోంది :

ఆమె వెనగ్గా క్రీనీడ : ఎవరదీ ?

మ త ర క్క సి అనుకోవాలా — మానవతా దేవత అనుకోవాలా ?

మిత్రుడా, శత్రువా ?

చెప్పు మహాత్మా : చెప్పు మహర్షీ — చెప్పు : :

నెమ్మదిగా కళ్ళు విప్పాను. నా చుట్టూ నేల ద్రవించిన పచ్చివాసన :